సాక్షి రంగారెడ్డి

శుక్రవారం : 21 : ఏప్రిల్ : 2023



మిడ్ వైఫరీ దేశానికే ఆదర్శం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్స హించేందుకు ఏర్పాటు చేసిన మిడ్ వైఫరీ వ్యవస్థ ఆదర్శమని మంత్రి హరీశ్ రావు అన్నారు. 8లో▸




మైనార్టీల సంక్షేమానికి కృషి

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



విద్యార్థులకు గాయాలు

పుట్టిన రోజు వేడుక కోసం కేక్ తెచ్చేందుకు బైక్‌పై వెళ్లిన ముగ్గురు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. 8లో▸



న్యూస్‌రీల్

ప్రభుత్వ భూమిని కాపాడండి

కలెక్టర్‌కు సీపీఐ నేతల వినతి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌లోని సర్వే నంబర్ 119లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల బారి నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ హరీశ్‌కు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంధోజు రవీంద్రచారి, జిల్లా నాయకుడు కృష్ణతో కలిసి వినతిపత్రం అందజేశారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను కొంత మంది స్థానిక కార్పొరేటర్లు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

'విస్తరణ' వేగవంతం చేయండి

ఎంపీ రంజిత్‌రెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అప్పా నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరీశ్ అధ్యక్షతన స్థానిక సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 80 శాతం భూ సేకరణ పూర్తయిందని, మిగిలిన 20 శాతం కూడా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూ సేకరణ పూర్తయిన ప్రాంతంలో పనులను వేగవంతం చేయాలని కోరారు. మే 1 నుంచి పనులు ప్రారంభించి సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని మెగా కాంట్రాక్టర్లకు సూచించారు. సమావేశంలో చేవెళ్ల ఆర్డీఓ వేణుగోపాల్, జాతీయ రహదారి అథారిటీ సంస్థ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇన్సూరెన్స్‌తో లబ్ధి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

కేశంపేట: ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నిర్దవెల్లిలో గురువారం ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాల ప్రీమియంను సకాలంలో చెల్లించాలని అన్నారు. ప్రతి సంవత్సరం ఎంపిక చేసుకున్న ప్రీమియం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణమ్మ, ఏపీఎం భగవంతు, భద్రప్ప, ప్రశాంత్‌రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏకు సినీనటుడు రవితేజ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీనటుడు రవితేజ గురువారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన కొత్తగా కొనుగోలు చేసిన బీవైడీ కంపెనీకి చెందిన అట్టో 3 ఈవీ బ్యాటరీ కారు రిజిస్ట్రేషన్ కోసం వచ్చారు. విద్యుత్‌తో నడిచే ఈ కారు ఖరీదు రూ.34.49 లక్షలు. వాహనం కోసం ఆయన రూ. 17,628 చెల్లించి 'టీఎస్ 09జీబీ 2628 ప్రత్యేక నంబర్‌ను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా సొంతం చేసుకున్నారు. నిబంధనల మేరకు ఖైరతాబాద్ ప్రాంతీయ రవాణా అధికారి రాంచందర్ వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. బండి నమోదు కోసం రవితేజ ఫొటో దిగడంతో పాటు డిజిటల్ ప్యాడ్‌పై సంతకం చేశారు.

రాజకీయ వేడి షురూ

- 23న చేవెళ్లకు కేంద్రమంత్రి అమిత్‌షా రాక
- 25న అసెంబ్లీస్థాయిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు
- మే 4న జిల్లాకు ప్రియాంక గాంధీ
- వరుసగా అన్ని పార్టీల కార్యక్రమాలతో హీటెక్కిన పాలిటిక్స్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో రాజకీయ వేడి మొదలైంది. అధికార బీఆర్‌ఎస్ సహా ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ ఇప్పటి నుంచే సమరానికి సన్నద్ధమవుతున్నాయి. ఈ మేరకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుని ప్రజాక్షేత్రంలో తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలే ప్రధాన ఎజెండాగా ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ ప్రణాళికలు రూపొందిస్తుండగా, సీఎం కేసీఆర్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ, అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలే ప్రధానంగా అధికార బీఆర్‌ఎస్ కార్యక్రమాలు రూపొందిస్తోంది. ఈ మేరకు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో నిత్యం ప్రజల్లో ఉండేలా ప్లాన్ చేసింది. తెలంగాణపై జాతీయ పార్టీ నేతలు సైతం దృష్టి సారించడం, వరుస పర్యటనలు నిర్వహిస్తుండటం, అధికార, ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు, ప్రత్యా రోపణలతో జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

ఏర్పాట్లలో నేతలు..

సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఈ నెల 23న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జిల్లాకు రానున్నారు. చేవెళ్ల కేంద్రంగా భారీ బహిరంగసభ నిర్వహించి, కేడర్‌లో జోష్ పెంచనున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ఇతర పార్టీల నేతలను పార్టీలోకి ఆహ్వానించి సంస్థాగతంగా బలపడేందుకు పదునైన వ్యూహాలు రచిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర నాయకత్వం భారీ ఏర్పాట్లే చేస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది. అగ్ర నాయకత్వం హాజరయ్యే ఈ సభకు ఇటు రంగారెడ్డి, అటు వికారాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించేందుకు నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు బండి సంజయ్ నాయకత్వంలో గురువారం మొయినాబాద్ కేంద్రంగా పార్టీ నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీలో చేరికలపై చర్చించారు. జిల్లా నుంచి ఎవరెవరు బీజేపీలో చేరనున్నారు? అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఆందోళనలకు కాంగ్రెస్ ప్లాన్

బీజేపీకి పోటీగా కాంగ్రెస్ కూడా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. జిల్లా కేంద్రంగా పలు ఆందోళనలకు ప్లాన్ చేసింది. మే 4న ఎల్బీ నగర్ నుంచి సరూర్‌నగర్ స్టేడియం వరకు లక్షమంది నిరుద్యోగులతో భారీ నిరసన ప్రదర్శన చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది. స్టేడియం వేదికగా భారీ బహిరంగ సభను నిర్వహించి ఎన్నికలకు శంఖారావం పూరించనుంది. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరుకానుండటంతో పీసీసీ, డీసీసీలు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలు, నిరుద్యోగం వంటి అంశాలే ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వారి మద్దతు కూడగట్టాలని యోచిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్‌ను ఓడించి, ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని భావిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

నిత్యం ప్రజల్లోనే ఉండాలి

- ఆత్మీయ సమ్మేళనాల్లో నేతలందరినీ భాగస్వాములను చేయాలి
- జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని.. ఇందు కోసం ఈ నెల 25న అన్ని నియోజకవర్గ స్థాయిల్లో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసి, ప్రతి కార్యకర్తను భాగస్వాములను చేయాలి'' అని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమై పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలకు క్షేత్రస్థాయిలో మంచి ఆదరణ లభిస్తోందని, ఇదే స్ఫూర్తితో మరింత బలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు ప్రజల్లోనే ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పార్టీ కేలండర్ ప్రకారం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎల్.రమణ, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, బొగ్గారపు దయానంద్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, కాలె యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌వి దిగజారుడు రాజకీయాలు



మాట్లాడుతున్న ఈటల రాజేందర్, చిత్రంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

- బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- చేవెళ్లలో అమిత్‌షా సభ ఏర్పాట్ల పరిశీలన

చేవెళ్ల: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె దించాలంటే బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. చేవెళ్లలో ఈ నెల 23న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులతో కలసి గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇతర పార్టీలకు ఓటు వేస్తే అది బీఆర్‌ఎస్‌కు వేసినట్లేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు తన వైపు లేరని కేసీఆర్‌కు తెలిసిపోయిందని, దీంతో ఆత్మీయ సమ్మేళనాల పేరుతో మద్యం, బిర్యానీలు పెట్టి లీడర్‌లకు వెలకట్టే దిగజారుడు రాజకీయలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతులకు రూ.లక్ష రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలకు సంబంధించిన నిధులు కేంద్రం వాటా ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మహిళల చేతి నుంచి వడ్డీని కట్టించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్‌నే మరిచిపోయారని విమర్శించారు. 30లక్షల మంది నిరుద్యోగులకు రావాల్సిన భృతి లేకపోగా.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో వారికి ఉద్యోగాలు రాకుండా చేశారన్నారు. టీఎస్‌పీఎస్సీ అంటేనే బ్రోకర్లు, పైరవీకారులకే ఉద్యోగాలు వస్తాయన్న అపవాదు ఉందన్నారు. దళితుల ఓట్ల కోసమే దళితబంధు తీసుకొచ్చారని విమర్శించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేసి ఇక్కడ ఉన్న విలువైన ప్రజల భూములను లాగేసుకొని ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా వ్యవహరిస్తోందని ఈటల మండిపడ్డారు. ఈ భూములు మీ అబ్బ జాగీరా కేసీఆర్ అని ప్రశ్నించారు. మన ఆత్మగౌరవానికి వెలకట్టే ఈ సర్కార్ మనకు అవసరమా ఆలోచించాలని కోరారు.

చేవెళ్లపై ప్రత్యేక దృష్టి

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంపై అమిత్‌షా ప్రత్యేక దృష్టి పెట్టారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. లక్ష మందితో చేవెళ్ల సభను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సభా ఏర్పాట్లును పరిశీలించేందుకు 14 విభాగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి వెంట పార్టీ కన్వీనర్ మల్లారెడ్డి, వికారాబాద్ అధ్యక్షుడు సదానంద్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాశ్, నియోజకవర్గం కన్వీనర్ ప్రభాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎయిర్‌పోర్ట్ మెట్రోకు ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ



సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్‌పోర్ట్ మెట్రోకు జనరల్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా సిస్ట్రా, రైట్స్, డీబీ ఇంజినీరింగ్ సంస్థల కన్సార్షియంను ఎంపిక చేసినట్లు హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిస్ట్రా సంస్థ ఫ్రాన్స్, రైట్స్ భారతీయ రైల్వేలు, డీబీ జర్మనీ దేశాలకు చెందిన ప్రముఖ ఇంజినీరింగ్ దిగ్గజ సంస్థలు కావడం విశేషం. జనరల్ కన్సల్టెంట్ ఎంపిక కోసం మొత్తం ఐదు అంతర్జాతీయ కన్సార్షియాలు పోటీపడ్డాయి. చివరకు సిస్ట్రా నేతృత్వంలోని కన్సార్షియం విజేతగా నిలిచింది. ఈ కన్సార్షియం సాంకేతికంగా అత్యధిక మార్కులు పొందడంతో పాటు, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సేవలను అందించేందుకు గాను రూ. 98.54 కోట్లు కోట్ చేసినట్లు ఎండీ తెలిపారు. ఇది పోటీలో పాల్గొన్న ఇతర సంస్థల కన్నా తక్కువ అని పేర్కొన్నారు. అయిదు అంతర్జాతీయ కన్సార్షియంల సాంకేతిక సామర్థ్యాన్ని, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని సిస్ట్రా నేతృత్వంలోని కన్సార్షియంను ఎంపిక చేశారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో నిర్మాణానికి అవసరమైన ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ టెండర్ డాక్యుమెంట్లను త్వరలోనే తయారు చేస్తుందని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

ఆ పార్టీలకు గుణపాఠం తప్పదు

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్



ఆమనగల్లులో హాత్‌సేహాత్ జోడో యాత్రలో యూత్ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: నియంత పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, రానున్న రోజుల్లో బీజేపీ సర్కార్‌కు ప్రజలు చరమగీతం పాడటం ఖాయమని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాలకూర్ల రవికాంత్‌గౌడ్ అన్నారు. భారత్ జోడో యాత్ర సందేశాన్ని గడపగడపకూ చేర్చేందుకు కొనసాగింపుగా హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్రను గురువారం కడ్తాల్‌లో నిర్వహించారు. ఆమనగల్లు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. ప్రజా సమస్యలే ధ్యేయంగా పోరాటం సాగిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అక్రమంగా కేసులు పెట్టి, పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయించడంపై మండిపడ్డారు. ప్రధాని మోదీ పేద ప్రజల సొమ్మును అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, సిలిండర్ ధరలను పెంచి, సామాన్యుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఐటీ, ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తూ ఇక్కట్లకు గురిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పరీక్షలతో పాటు వరుసగా పరీక్ష పేపర్‌లు లీకేజీలతో నిరుద్యోగులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రేయింబవళ్లు కష్టపడి చదివిన నిరుద్యోగుల ప్రాణాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. అరాచక పాలన సాగిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రైతు రుణమాఫీతో పాటు, రూ.5లక్షల వరకు ఆరోగ్యశ్రీ అమలు చేయనుందని, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మహేశ్, నాయకులు ఆసిఫ్‌అలీ, హీరాసింగ్, కృష్ణనాయక్, అనిల్‌గౌడ్, జహంగీర్‌బాబా, బీచ్యానాయక్, దళపతి, రాజు, ఫరీద్, సత్యం, రవి, షాబుద్దీన్, భాస్కర్, రాజేశ్, ఇమ్రాన్, మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు ఏమైనట్టు..?

- వ్యక్తి ఆత్మహత్య
- వీడని భార్య, కూతురి అదృశ్యం మిస్టరీ
- మూడేళ్ల క్రితం మొదటి భార్యకు తెలియకుండా రెండో వివాహం
- తల్లిదండ్రులకు కూతురి సమాచారం ఇవ్వని రామకృష్ణ
- కూతురి ఆచూకీ కోసం వచ్చారని తెలిసి బలవన్మరణం

మొయినాబాద్: మొదటి భార్యకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడు. నమ్మి పిల్లనిచ్చిన అత్తింటివారికి కూతురి సమాచారం తెలియనీయలేదు. ప్రస్తుతం వారు ఎక్కడున్నారు.. ఏమయ్యారో చెప్పకుండానే ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు మిస్టరీని ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది. నాగర్‌కర్నూల్ జిల్లా బుచ్చినపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన రామకృష్ణ(40) మొయినాబాద్ మండలం సురంగల్ గ్రామానికి చెందిన మల్లమ్మను 2013లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. 2018లో బతుకుదెరువు కోసం చిలుకూరు గ్రామంలోని ఇంద్రారెడ్డినగర్‌కు వచ్చారు. రామకృష్ణ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పనులు దొరక్క మూడేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాజిపేటకు వెళ్లాడు. అక్కడ కోళ్ల ఫారంలో పని చేశాడు. ఆ సమయంలో ఇందిరతో పరిచయం ఏర్పడి పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు ఓ కూతురు పుట్టింది. రెండు సంవత్సరాల క్రితం ఇందిరను, పాపను చిలుకూరులోని ఇంద్రారెడ్డినగర్‌కు తీసుకొచ్చాడు. అప్పటి నుంచి ఇందిర సొంత ఊరికి వెళ్లలేదు. మహిళ కుటుంబ సభ్యులు పలుసార్లు రామకృష్ణకు ఫోన్ చేసి ఇంటికి రావాలని, కూతురితో మాట్లాడించాలని కోరారు. ఫోన్ చేసిన ప్రతిసారి ఏదో ఒక సాకు చెప్పి ఫోన్ పెట్టేసేవాడు. దీంతో ఇందిర కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి నాలుగు రోజుల క్రితం తిమ్మాజిపేటకు వచ్చారు. రామకృష్ణకు ఫోన్ చేస్తే తీయకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం ఇందిర తల్లి, కుటుంబ సభ్యులు చిలుకూరులో రామకృష్ణ ఉంటున్న ఇంటికి వచ్చి డోర్ కొట్టారు. వారిని కిటికీలోంచి చూసిన రామకృష్ణ.. భయాందోళనకు గురై బెడ్‌రూంలోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఇందిర, పాప సమాచారం తెలియకుండా పోయింది. రామకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రామకృష్ణ మృతితో తమ కూతురు ఇందిర, పాప సమాచారం తెలియకుండా పోయిందని ఇందిర తల్లి ఊశమ్మ బోరున విలపించింది. ఇందిర, పాప ఆచూకీ తెలుసుకోవాలని పోలీసులను వేడుకున్నారు.

డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: అనాథ, పేద మహిళా అభ్యర్థుల నుంచి పలు డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులు అందిస్తున్నట్టు చెప్పారు. సివిల్ ఇంజినీరింగ్ (డీసీఈ), ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ (డీఈఈఈ), కంప్యూటర్ ఇంజినీరింగ్ (డీసీఎంఈ), కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (డీఈసీఈ) చేయడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఒక్కో కోర్సులో 60 సీట్లు మాత్రమే ఉంటాయన్నారు. ఇందులో అనాథలు, పేదవారు, పలు మహిళా సంస్థల్లోని అమ్మాయిల కోసం 42 సీట్లు కేటాయించారన్నారు. పాలిసెట్ పరీక్ష రాయకపోయినా 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన వారు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మే 5వ తేదీలోపు కుల, ఆదాయ, డెత్ సర్టిఫికెట్లు, స్టడీ సర్టిఫికెట్లతో బాల రక్ష భవన్‌లో సమర్పించాలని కోరారు.

పబ్లిక్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: 2023–24 సంవత్సరానికి గాను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్, బేగంపేటలో 1వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరీశ్ గురువారం ఒకప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జిల్లాకు సంబంధించిన వారై ఉండాలని.. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలన్నారు. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. దరఖాస్తులు ఈ నెల 22 నుంచి 29వ తేదీలోపు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. 01.01.2017 నుంచి 31.12.2017 మధ్య జన్మించి ఉండాలన్నారు. మే 5న లాటరీ పద్ధతిలో తీస్తారని, ఈ నెల 29న దరఖాస్తు చేసుకోవడానికి చివరి అవకాశమన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శ్మశానవాటికలో మంటలు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ ఫేజ్-2లోని శ్మశాన వాటికలో ప్రమాదవశాత్తు గురువారం చెత్త కుప్పలకు నిప్పంటుకుంది. దీంతో పక్కనే ఉన్న జీబీ కాలనీ, భగత్‌సింగ్ నగర్‌లోని ఇళ్లల్లోకి భారీగా పొగ వ్యాపించింది. కాలనీవాసులు పొగతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మంటలు ఎక్కడి నుంచి వస్తున్నాయో అర్థం కాక ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే మంటలను ఆర్పి వేశారు. చెత్తాచెదారం అధికంగా ఉండడంతో ఎండ వేడికి అగ్ని ప్రమాదం సంభవించి ఉండవచ్చని, ఎలాంటి నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

మంత్రి సబితారెడ్డి
- మహేశ్వరం జామా మసీదులో ఇఫ్తార్ విందు
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మంత్రి సబిత, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మహేశ్వరంలోని జామా మసీదులో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు ఉపవాస దీక్ష విరమింపజేశారు. అనంతరం రంజాన్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మైనార్టీలకు అన్ని రంగాల్లో గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సునిత నాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అదిల్ అలీ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు నాసర్‌ఖాన్, శివ గంగ ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ ఎంఏ సమీర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంబయ్య యాదవ్, డైరెక్టర్లు చంద్రయ్య, ప్రభాకర్, బాలయ్య, అశోక్, బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం సీనియర్ నాయకులు మినాజ్ పటేల్, ఎంఏ సత్తార్, ఫరీద్, మత గురువు హైమద్ అలీ, అబ్బాస్, అస్లాం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు



క్షతగాత్రులను 108లోకి ఎక్కిస్తున్న బీజేపీ నేత శ్రీరాములు యాదవ్ తదితరులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్

- కేక్ తెచ్చేందుకు బైక్‌పై వెళుతుండగా ప్రమాదం
- ఒకరి పరిస్థితి విషమం

కందుకూరు: పుట్టిన రోజు వేడుక కోసం కేక్ తెచ్చేందుకు బైక్‌పై వెళ్లిన ముగ్గురు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కందుకూరు మండలం లేమూరు గ్రామానికి చెందిన విక్రమ్, శ్రీనాథ్, విఘ్నేష్ స్నేహితులు. ఇటీవల వీరు పదో తరగతి పరీక్షలు రాశారు. విక్రమ్ పుట్టిన రోజు కావడంతో గురువారం మధ్యాహ్నం కేక్ తెచ్చేందుకు ముగ్గురు బైక్‌పై కందుకూరు చౌరస్తాకు బయలుదేరారు. మార్గమధ్యలో లేమూరు - గూడూరు చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న లారీని వీరి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తన వాహనాన్ని ఆపి 108కి సమాచారం ఇచ్చారు. అందులో గాయపడిన విద్యార్థులను ఎక్కించి శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే విఘ్నేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరాలి

ఈటల రాజేందర్

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగరాలని, అందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని టంగటూ రు, మహారాజ్ పేట్, గోపులారం గ్రామాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. వారికి ఈట ల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీ ఎంతో పటిష్టంగా ఉందన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు పార్టీలో చేరడం జరుగుతోందని తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తులసీరాం విజయ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, రాజేందర్ సింగ్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మహిపాల్ (ఫైల్)

షాబాద్: బైక్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన కాంతారెడ్డి(70) గురువారం నాగర్‌గూడలో బట్టలు కుట్టించుకోవడానికి వచ్చాడు. ఈ క్రమంలో ఎస్‌బీఐ వద్ద రోడ్డు దాటుతుండగా షాబాద్ నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్న బైక్ అతన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కాంతారెడ్డిని 108లో శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కూతురు హంసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్: యువకుడు మృతి

అతివేగంగా బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ గురువయ్యగౌడ్ కథనమ మేరకు.. చేవెళ్ల మండలం ఇక్కారెడ్డిగూడ గ్రామానికి చెందిన ఆర్ మహిపాల్(25) గురువారం మక్కజొన్న విత్తనాలు తెచ్చేందుకు బైక్‌పై నాగర్‌గూడకు వచ్చాడు. ఇంటికి వెళ్లే క్రమంలో డివైడర్‌కు వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేత్రదానం

చేవెళ్ల: ఎనిమిదేళ్లుగా ఇక్కారెడ్డిగూడలో ఎవరు చనిపోయినా నేత్రదానం చేస్తున్నారు. గురువారం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మహిపాల్ నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయడానికి అంగీకరించారు. దీంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది చేవెళ్ల ఆస్పత్రిలో యువకుని నేత్రాలను సేకరించారు.

నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోండి

'హిల్‌ఫోర్టు'పై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నగరంలోని పురాతన హిల్‌ఫోర్ట్ ప్యాలెస్ భవనం ప్రమాదకరంగా ఉందని జాతీయ నిర్మాణ సంస్థ డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ నివేదికలో పేర్కొంటే.. కొత్త నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వవచ్చని హైకోర్టు సూచించింది. వారసత్వ చరిత్రను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. కమిటీ ఈ నెల 12న ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తీసుకునే చర్యలపై తదుపరి విచారణలో తెలియజేయాలని ఆదేశించింది. వారసత్వ హిల్ ఫోర్టు ప్యాలెస్ పునరుద్ధరణ పనులు చేపట్టేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైదరాబాద్ హెరిటేజ్ ట్రస్ట్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం(పిల్) దాఖలు చేసిన విషయం విదితమే.

టీవీ నటి ఇంట్లో భారీ చోరీ

- 129 తులాల బంగారు నగలు, 293 తులాల వెండి వస్తువుల అపహరణ

పంజగుట్ట: టీవీ నటి ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న టీవీ నటి సుమిత్ర పంపన ఈ నెల 17న ఇంటికి తాళం వేసి సమీపంలోనే ఉంటున్న తన సోదరుడి భార్య భువనేశ్వరికి తాళం చెవులు ఇచ్చి ఢిల్లీ వెళ్లింది. 18వ తేదీ ఉదయం భువనేశ్వరి సుమిత్ర ఇంటికి వెళ్లి చూడగా మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో ఆమె తన భర్త విజయ్‌కుమార్‌కు సమాచారం అందించింది. అతను ఢిల్లీలో ఉన్న సోదరి సుమిత్రకు సమాచారం అందించాడు. అదే రోజు రాత్రి ఢిల్లీ నుంచి నగరంలోని ఇంటికి వచ్చిన సుమిత్ర బెడ్‌రూంలో ఉంచిన 129 తులాల బంగారు, వజ్రాభరణాలు, అలాగే 293 తులాల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించింది. ఈ నెల 19న పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితులే చంపేశారు

- యువకుడి దారుణ హత్య
- నలుగురు నిందితుల అరెస్ట్

దుండిగల్: స్నేహితుల చేతిలో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ, గాగిల్లాపూర్‌కు చెందిన అంజయ్య, శంకరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అంజయ్య చాలా కాలం క్రితం మృతి చెందాడు. పెద్ద కుమారుడికి మతిస్థిమితం సరిగాలేదు. చిన్న కుమారుడు దాసరి మల్లేశ్(25) పెయింటర్‌గా పని చేస్తూ తల్లిని పోషిస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన మల్లేశ్ తిరిగి రాలేదు. గురువారం ఉదయం అదే ప్రాంతంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మల్లేష్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి ఒంటిపై గాయాలు ఉండడంతో హత్యగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో ఘర్షణ

బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన మల్లేశ్ తన స్నేహితులు చాంద్ పాషా, జమాల్, జబ్బార్, బిట్టుతో కలిసి గురువారం తెల్లవారుజామున 2 గంటల వరకు మద్యం సేవించినట్లు తెలిసింది. ఆ తర్వాత మాటా మాటా పెరగడంతో వారు మల్లేష్‌పై దాడి చేసి హత్య చేసి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అంత్యక్రియలకు చేయూత

ఒక వైపు తండ్రి లేక.. అన్న మానసిక స్థితి సరిగ్గా లేక.. వృద్ధాప్యంలో ఉన్న తల్లికి ఆసరాగా ఉన్న కొడుకు హత్యకు గురవడంతో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది. దినసరి కూలీగా పని చేస్తున్న మల్లేశ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో అతడి అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానిక నాయకులు, మహిళలు అంత్యక్రియలకు ఆర్థికసాయం చేశారు.

నగర శివారులో కోళ్ల పందెం

23 మంది అరెస్టు

ఇబ్రహీంపట్నం: కోళ్ల పందేలు ఆడుతున్న 23 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కప్పపహాడ్ గ్రామ సమీపంలోని ఓపెన్ ల్యాండ్‌లో గురువారం కోళ్ల పందాలు ఆడుతున్నారని సమాచారం మేరకు ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 23 మందిని అదుపులోకి తీసుకొని రూ.1,0,4000 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందినవారు కాగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటూ భవన నిర్మాణ మేస్త్రీలు, కూలీలుగా పనులు చేస్తూ జీవిస్తున్నారని పోలీసులు తెలిపారు. కాగా పందెం ప్రదేశంలో 5 కోళ్లు లభించగా మూడు కోళ్లు చనిపోయి ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కబేళాకు తరలిస్తున్న గోవులకు విముక్తి

పహాడీషరీఫ్: కబేళాకు తరలిస్తున్న నాలుగు గోవులకు పహాడీషరీఫ్ పోలీసులు విముక్తి కల్పించారు. గురువారం ఉదయం తుక్కుగూడ నుంచి పహాడీషరీఫ్ వైపు ఓ ట్రక్కులో నాలుగు గోవులను కబేళాకు తరలిస్తుండగా గమనించి ఆపారు. బీబీ నగర్ నుంచి నగరంలోని కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ మహ్మద్ ఇంతియాజ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం జీవాలను గోశాలకు తరలించారు.

గోరక్షకులపై దాడి

కబేళాకు ఆవులను తరలిస్తున్న విషయం తెలుసుకున్న కొంత మంది గోరక్షకులు ఘటనా స్థలికి చేరుకున్నారు. అప్పుడే అక్కడికి మరో వాహనంలో చేరుకున్న ఆవుల తరలించే వారు గోరక్షకులపై దాడికి దిగారు. దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని వివరాలు సేకరించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గోరక్షకుల జోలికి వస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కడ్తాల్: పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

కడ్తాల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మాడ్గుల్ సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి మండలంలోని గాంగ్య తండా వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడి చేసి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చుక్కాపూర్‌లో..

తలకొండపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని చుక్కాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. చుక్కాపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను కానిస్టేబుల్ తిరుపతి పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశు తెలిపారు.

మిడ్ వైఫరీ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- మంత్రి హరీశ్‌రావు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు రెట్టింపు
- నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్, రక్తనిధి కేంద్రాల ప్రారంభం



రోగులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నాంపల్లి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు మిడ్ వైఫరీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఈ విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. గతంలో 30 శాతం సాధారణ ప్రసవాలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 65 శాతానికి పెరిగిందన్నారు. ఇందులో భాగంగానే నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో మిడ్ వైఫరీ వ్యవస్థపై 18 నెలలుగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గురువారం నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రం, రక్తనిధి కేంద్రాలను (బ్లడ్ బ్యాంక్) ఆయన స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తదితర మూడు ఆసుపత్రుల్లోనే డయాలసిస్ కేంద్రాలు ఉండేవన్నారు. ప్రస్తుతం వీటి సంఖ్య 102కు చేరుకుందని , ప్రతి నియోజకవర్గంలో ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. డయాలసిస్ కేంద్రాల ద్వారా ఆరోగ్య శ్రీ కింద వారానికి రెండు మూడుసార్లు ఉచితంగా డయాలసిస్ చేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్డ్ ఫిల్టర్‌ను ఉపయోగించి డయాలసిస్ చేస్తున్నామని, తద్వారా ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ రాకుండా కార్పొరేట్ తరహాలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. డయాలసిస్ రోగులకు ఆర్థికంగా భరోసా ఇచ్చేందుకు ఆసరా పెన్షన్, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏటా 150 వరకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరుగుతున్నాయని, ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ తర్వాత అవసరమయ్యే మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. కిడ్నీ రోగుల కోసం ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేస్తుండగా, అందులో డయాలసిస్ రోగుల కోసం ఏటా రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 28 ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు ఉండగా, నేడు వాటి సంఖ్య 56కు చేరుకుందన్నారు. 27 బ్లడ్ బ్యాంకులకు కాంపోనెంట్ సపరేటర్స్ ఇచ్చామని, ఫలితంగా ఒక్క యూనిట్ రక్తాన్ని ముగ్గురికి వాడుతున్నట్లు మంత్రి వివరించారు. నగరానికి నలువైపులా టిమ్స్ (టిఐఎంఎస్) పనులు చురుగ్గా జరుగుతున్నాయని, గచ్చిబౌలి టిమ్స్‌ను కూడా వెయ్యి పడకలు, నిమ్స్‌కు అదనంగా రెండు వేల పడకలను మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే నెలలో నిమ్స్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్, టీడీపీ హైదరాబాద్‌లో ఒక్క ఆసుపత్రి కూడా నిర్మించలేదన్నారు. రాష్ట్రంలో ట్రామా కేర్ సెంటర్లను లెవల్ వన్, లెవల్ టు, లెవల్ త్రీగా వర్గీకరించి బలోపేతం చేస్తున్నామని, కార్పొరేట్ తరహాలో అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎక్కడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల కోసం మెయింటెనెన్స్ ఇవ్వడం లేదని, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో పడకకు ప్రతి నెల రూ.7500 ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బెట్టింగ్ ముఠాల గుట్టురట్టు

- రూ. 1.41కోట్ల విలువైన సొత్తు స్వాధీనం
- ఆరుగురు నిందితుల అరెస్ట్
- మరో నలుగురు పరారీ



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సందీప్ గోనె

కుత్బుల్లాపూర్: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న రెండు ముఠాల ఆటకట్టించిన మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు వారి నుంచి రూ.50 లక్షల నగదు సహా రూ.1.41, 52,548 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సందీప్ గోనే వివరాలు వెల్లడించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు గురువారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జయభేరి ప్రాంతంలోని ఓ ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా బుకీని అదుపులోకి తీసుకుని విచారించగా అతడు ఇచ్చిన సమాచారం మేరకు కూకట్‌పల్లి ప్రాంతంలోని ప్రధాన స్థావరంపై దాడి చేసిన పోలీసులు రూ.50 లక్షల నగదుతో పాటు ఐదు బెట్టింగ్ బోర్డులు, ఎనిమిది ల్యాప్ టాప్‌లు, 62 మొబైల్స్, 20 స్మార్ట్ ఫోన్లు, నాలుగు టీవీలు, ఒక రౌటర్, నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకపై సమాచారం అందడంతో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న ప్రధాన నిందితుడు వసంతకుమార్‌తో పాటు కార్తీక్, వీరేశ్, చంద్రమోహన్‌రావు అక్కడి నుంచి పరారయ్యారు. వెంకటసాయి, వెంకట రామరాజు, రమేష్, శివకుమార్, మనోజ్‌కుమార్, సతీష్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై గేమింగ్ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేసిన పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.